క్లుప్తంగా

రేపు ఉచిత మెగా మెడికల్ క్యాంపు



పట్నంబజారు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సెప్టెంబరు 2న ఉచిత మెడికల్ మెగా క్యాంపు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వై షేక్ చెప్పారు. ఆర్.అగ్రహారంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి మహానేత వైఎస్సార్ కొనియాడారు. ఈనెల 2న పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగే వర్ధంతి కార్యక్రమం, అనంతరం ఉచిత వైద్య శిబిరం వైద్యులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం జరుగుతోందన్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయురాలికి ఏఎన్‌యూ డాక్టరేట్



గుంటూరు ఎడ్యుకేషన్: కేవీపీ కాలనీ కేఎస్ఆర్టీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ఎస్‌సీహెచ్ సుధా మైథిలికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రాంబాబు గురువారం తెలిపారు. శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజి సాహిత్యానుశీలనం అనే అంశంపై గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఇటీవల ఏఎన్‌యూలో జరిగిన స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ సుధా మైథిలిని హెచ్ఎం రాంబాబుతో పాటు పాఠశాలలోని సహచర ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 207 వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 122 వార్డు వలంటీర్ల పోస్టులను భర్తీ చేయుటకు సెప్టెంబర్ 2న అన్ని వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఖాళీల వివరాలను ప్రచురిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు వలంటీర్ పోస్టుకు దరఖాస్తుదారుడు, 10వ తరగతి/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై , ఆగస్టు 31, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండినవారై, 35 సంవత్సరములు మించని వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుని ఆధార్ కార్డు చిరునామా సంబంధిత మున్సిపాలిటీ పరిధికి సంబంధించి ఉండాలన్నారు.

సెప్టెంబర్ 3 నుంచి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో దాఖలైన దరఖాస్తులను పరిశీలించి, 12, 13 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వార్డు వలంటీర్లు సెప్టెంబర్ 15 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

65 మందికి ఉచిత వైద్య సేవలు

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించే ఫైబ్రో స్కాన్‌ను ఉచితంగా 65 మందికి చేశామని కేర్‌వెల్ హాస్పటల్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక గుంటూరువారితోట 7వ లైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఒక్కో రోగికి సుమారు రూ. 10 వేల ఖరీదు చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. రెండేళ్లుగా తమ ఆసుపత్రిలో ప్రతి నెలా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. త్వరలోనే ఉచిత వైద్య శిబిరం మరోసారి నిర్వహిస్తామని కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ భాష తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు ఈ 8341713713, 9854757999 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అన్నా, చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ



ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి రాఖీ కడుతున్న నూరిఫాతిమా, డెప్యూటీ మేయర్ షేక్ షజిల, మహిళలు

నెహ్రూనగర్: సోదరీ, సోదరుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా రాఖీ పండుగ నిలుస్తుందని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా నగర పాలక సంస్థ మహిళా కార్పొరేటర్లు మేయర్‌కు సంపత్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాఖీ కట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ళ మధ్య అనుబంధానికి చిహ్నమని, సోదరీమణులు తమ సోదరుని అభివృద్ధిని కాంక్షిస్తూ రాఖీ కడతారన్నారు. అదేవిధంగా ఎటువంటి రక్తసంబంధం లేకపోయినా, నగర పాలక సంస్థ మహిళా కార్పొరేటర్లు అందరు తనని అన్నలా, తమ్ముడిలా భావించి రక్షా బంధన్ కట్టారని, వారందరికీ అన్నలా, తమ్ముడిలా ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, నగర పాలక సంస్థ మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీక..

గుంటూరు ఎడ్యుకేషన్: సోదరీ, సోదరుల అనుబంధానికి, ప్రేమకు ప్రతీక రాఖీ పండుగ అని జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. గురువారం రాఖీ పౌర్ణమి సందర్భంగా జెడ్పీ కార్యాలయంలో హెనీ క్రిస్టినా పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్‌కు రాఖీ కట్టారు. ఆమె మాట్లాడుతూ రక్త సంబంధీకులతో పాటు ప్రేమ, ఆప్యాయతను చూపే వారందరు మనకు సోదర సమానులేనని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని జెడ్పీటీసీ రమేష్‌కు సూచించారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు రాఖీ కట్టిన మహిళలు..

పట్నంబజారు: రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో గురువారం డెప్యూటీ మేయర్ షేక్ సజిల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, అనుబంధ విభాగాల నేతలు ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి రాఖీ కట్టారు. అనంతరం అప్పరెడ్డి వారిని ఆశీర్వదించారు. అదేవిధంగా ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కార్యాలయంలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే గిరికి రాఖీ కట్టారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ షజిల, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పఠాన్ ముంతాజ్‌బేగం, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.



మేయర్ కావటి మనోహర్‌కు రాఖీలు కడుతున్న మహిళా కార్పొరేటర్లు



రక్షాబంధన్ కట్టిన మహిళలతో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



జెడ్పీటీసీ రమేష్‌కు రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

పైపులైన్ లీకులకు మరమ్మతులు

- సంజీవయ్యనగర్ రైల్వేగేటు వద్ద పైపులైన్‌పై భారీ లీకు
- గురువారం పంపింగ్ అనంతరం మరమ్మతులు చేపట్టిన ఇంజినీరింగ్ అధికారులు



పైపులైన్‌కు మరమ్మతులు జరుగుతున్న దృశ్యం (ఇన్‌సెట్) లో పైపులైన్‌లో ఏర్పడిన భారీ లీకు

నెహ్రూనగర్: నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం వాటర్ ట్యాంకులకు(పశ్చిమ నియోజకవర్గానికి) తాగునీటిని సరఫరా చేసే 800 ఎంఎం ప్రధాన పైపులైన్‌పై సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద భారీ లీకు ఏర్పడటంతో ఇంజినీరింగ్ అధికారులు గురువారం ఉదయం పంపింగ్ అనంతరం లీకులకు మరమ్మతులు చేపట్టారు. కొన్ని దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్ కావడంతో నీటి ఒత్తిడికి పైపులైన్‌పై తరుచు లీకులు ఏర్పడుతుంది.

హెచ్ఎల్ఆర్‌కు 900 డయా పైపులైన్..

800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో రెండేళ్ల కిందట ప్రస్తుతం ఉన్న పైపులైన్ స్థానంలో 900 ఎంఎం డయాపైపులైన్ సంజీవయ్యనగర్, వసంతరాయపురం ట్యాంకులు, జానీ కాలనీ, శ్రీ హస్పిటల్, డొంకరోడ్డు మెయిన్‌రోడ్డు మీదుగా అమరావతిరోడ్డు క్రాస్ చేసుకుంటూ హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం)కు పైపులైన్ వేశారు. అదే విధంగా నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటు వరకు 900 ఎంఎం డయా పైపులైన్ గత నెల రోజుల క్రితం వేశారు. రైల్వే గేటు దాటుకుంటూ ట్రాక్ కింద నుంచి పైపులైన్ వేయాల్సి ఉంది. దీనికి రైల్వేశాఖ నుంచి పర్మిషన్ రాకపోవడంతో పాత పైపులైన్ మీదనే పంపింగ్ జరుపుతున్నారు.

త్వరలో శాశ్వత పరిష్కారం

పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి తాగునీటి సరఫరాలో ప్రతిసారి ఇబ్బందులు తలెత్తునే ఉంది. దీనికి ఇంజినీరింగ్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపేందుకు ట్రాక్ కింద నుంచి పైపులైన్ అనుసంధాన పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే రైల్వేశాఖ అనుమతి కోసం తగిన నివేదికలు పంపిన నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు వీలైనంత త్వరలో పర్మిషన్ రానుంది. దీంతో ట్రాక్ కింద మిగిలిన పైపులైన్ వేస్తే పశ్చిమ నియోజవర్గానికి తాగునీటి సరఫరాలో ఎటువంటి ఢోకా ఉండదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

రైల్వేశాఖ నుంచి పర్మిషన్ రాగానే పైపులైన్ వేస్తాం

నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్‌కు 800 ఎంఎం డయా పైపులైన్ స్థానంలో 900 డయా పైపులైన్ వేశాం. సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ కింద మాత్రం పెండింగ్ ఉంది. ట్రాక్ కింద పైపులైన్ వేసేందుకు రైల్వే శాఖ అనుమతి కోసం దరఖాస్తు చేశాం. రైల్వేశాఖ పర్మిషన్ 20 రోజుల్లోపు రానుంది. పర్మిషన్ రాగానే ట్రాక్ కింద 900 ఎంఎం డయా పైపులైన్ వేసి తరచూ పడే లీకులకు స్వస్తి పలుకుతాం.

– కోటేశ్వరరావు, ఈస్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

విద్యార్థులు రక్తదాన ఆవశ్యకత గుర్తించాలి



డాక్టర్ సుష్మాను సత్కరిస్తున్న జ్యోత్స్నకుమారి, రోటరీ క్లబ్ ప్రతినిధులు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత విభాగాలతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రక్తదాన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. బ్లోసమ్స్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సుష్మా మాట్లాడుతూ రక్తదానం చేయడంలో ఎటువంటి అపోహలు అవసరం లేదని, ఆరోగ్యంగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రక్తదాన అవగాహన కార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ ధాత్రికుమారి, సంతోషికుమారి, సుబ్బరత్నమ్మ, విజయకుమారి, మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దిశ పీఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: దిశ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, త్వరితగతిన దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ అన్నారు. నగరంపాలెంలోని దిశ పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదు తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్‌లో నమోదు చేయడంతోపాటు రశీదులు ఇవ్వాలని అన్నారు. ఎస్పీ వెంట దిశ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, దిశ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం ఉన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలి

గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఓ.శారద తెలిపారు. గురువారం లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పత్తి పంట పర్యవేక్షణ, గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని పత్తి పంటను పరిశీలించారు. పంట పూత దశలో ఉందని, గులాబి రంగు పురుగు ఉనికిని గుర్తించి, నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోజుకు 8 రెక్కల పురుగులను వరుసగా మూడు రోజులు బుట్టల్లో గుర్తించినట్లయితే గుడ్లపై పనిచేసే వేపగింజల కషాయం 5 శాతం, అజాడిరాక్సిన్ 3000 పీపీఎం, 600 మిల్లీ లీటర్లు గానీ, ప్రొఫెనోఫాస్ 40 మిల్లీ లీటర్లు గానీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. గుడ్డి పువ్వులను గుర్తించి, వాటిని పీకి నాశనం చేయాలని వివరించారు. పురుగుల ఉధ్రుతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎకరానికి 15 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పత్తిలో తామర పురుగులను, పచ్చదోమ ఉధ్రుతిని గమనించటం జరిగిందని, వీటి నివారణకు ఫ్రిఫోనిల్ 400 మిల్లీ లీటర్లు గానీ, ఫ్లోనికామయిడ్ 60 గ్రాములు కానీ ఎకరానికి తగిన నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎసిఫేట్, మోనోక్రోటోఫాస్ మందులు రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారని చెప్పారు. వీటిని వాడినట్లయితే రసం పీల్చే పురుగు ఉధ్రుతి పెరుగుతుందని చెప్పారు. కాండం పూత విధానాన్ని రైతులకు వివరించారు. ఎల్‌బీజీ 904 రకం మినుము విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో నరశింహులు, వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

రేపు సాయంత్రం నుంచి తాగునీటి సరఫరా

నెహ్రూనగర్: సంజీవయ్యనగర్ రైల్వే గేట్ వద్ద ఏర్పడిన లీకులకు ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు చేస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నేటి రాత్రికి మరమ్మతులు పూర్తి చేసి శనివారం ఉదయం పాక్షికంగా, సాయంత్రం నుంచి యథావిధిగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

నూతన ఆపరేషన్ థియేటర్‌కు భూమిపూజ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో గురువారం నూతన ఆపరేషన్ థియేటర్ భవన నిర్మాణానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ భూమిపూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డిలు జీజీహెచ్‌పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో ఆసుపత్రిలో అభివృద్ధి పనుల కోసం తాను ఉన్నతాధికారులను నిధులు కావాలని కోరగా, తక్షణమే రూ. 5 కోట్లను మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో నూతన ఆపరేషన్ థియేటర్‌ను నిర్మిస్తున్నామన్నారు. అత్యవసర వైద్యం రోగులకు చేరువ కావాలన్నదే లక్ష్యంగా పనిచేయాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. ఆపరేషన్‌ల కోసం జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు నమ్మకం కలిగేలా వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌సీకి సత్కారం



నగరంపాలెం: రిటైర్‌మెంట్ అనంతర జీవితం సుఖంగా, సంతోషంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ అన్నారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బట్టల శివరామకృష్ణ శ్రీనివాస ప్రసాద్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేయగా, గురువారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పూలమాలతో సత్కరించారు. ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరావు, ఎస్‌బీ ఇన్‌చార్జి డీఎస్పీ బాలసుందరరావు, సీఐ బాలసుబ్రహ్మణ్యం, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రమేష్‌కృష్ణన్, జిల్లా మాజీ పోలీస్ అసోసియేషన్ సభ్యులు పూర్ణచంద్రరావు, జె.వెంకటేశ్వరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.


డాక్టర్ సీఎస్ రావుకు మదర్ థెరిస్సా అవార్డు



డాక్టర్ సి.ఎస్.రావును సన్మానిస్తున్న మల్లాది విష్ణు, పుణ్యశీల

గుంటూరు మెడికల్: మదర్ థెరిస్సా సర్వీస్ అవార్డును గుంటూరు నగరానికి చెందిన ప్రముఖ క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.ఎస్.రావుకు లభించింది. గురువారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ శాసనసభ్యుడు మల్లాది విష్ణు, ఏపీఐడీసీ చైర్‌పర్సన్ పుణ్యశీల చేతులు మీదుగా అందుకున్నారు. ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ మదర్ థెరిస్సా జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న రాష్ట్రంలోని పలువురికి వారి సేవలను గుర్తించి వారికి అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న డాక్టర్ సి.ఎస్.రావుకు గుంటూరు లలిత హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముంజంపల్లి శివకుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీ రామనామక్షేత్రం పవిత్రోత్సవాలు



అలంకరణలో ఉత్సవమూర్తులు

పాత గుంటూరు: ఆర్.అగ్రహారం శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీ సీతారామనామ సంకీర్తన సంఘం ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు ఆధ్వర్యంలో శ్రీ రామనామక్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణ బృందం శాంతి హోమం, పూర్ణాహుతి, ఉత్సవమూర్తులకు పంచామృతాలతో విశేషంగా అభిషేకార్చనలు నిర్వహించారు. అనంతరం రెండు ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠ చేసి పూజలు నిర్వహించారు. రామకోటి స్తూప నిర్మాణానికి శంకుస్థాపన, నూతనంగా నిర్మించిన గోశాలకు విశేష పూజలు నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ జరిగింది. సభ్యులు కేవీ సుబ్బారావు, అక్కిశెట్టి బాబురావు, కర్పూరపు శాంతి భూషణ్, పబ్బిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

గోరంట్ల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస పౌర్ణమి ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుదర్శన మూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. సుదర్శన హోమంలో భక్తులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాం



ఎమ్మెల్సీ లక్ష్మణరావును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన దిశగా కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. నగర శివారులోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు గురువారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమన్నారు. కమ్యూనికేషన్స్ పెపొందించుకోవటంలో ఆంగ్ల విద్యపై పట్టు సాధించాలన్నారు. సాంకేతిక నైపుణ్యతలు ఎంతో అవసరమని, నూతన ఆలోచన విధానాలు సమాజాభివృద్ధికి దోహదపడే విధంగా కృషిచేయాలని సూచించారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థికి నైపుణ్యతలతో కూడిన విద్యను అందించి, ఉపాధి కల్పన దిశగా కళాశాల కృషిచేస్తుందని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జీవతంలో ప్రతి నిమిషాన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ప్రపంచంతో పోటీ పడాలని సూచించారు. ఎమ్మెల్సీని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని గురువారం గుంటూరు రైల్వే స్టేషన్‌లో జిల్లా బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వంద రూపాయలు స్మారక నాణెం ఆవిష్కరణ కార్యక్రమానికి ఢిల్లీ వెళ్లి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు రైల్వేస్టేషన్‌కు పురందేశ్వరి చేరుకున్నారు. ఈసందర్భంగా జిల్లా బీజేపీ నేతలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, రాష్ట్ర ప్రవాస్ యోజన కో–కన్వీనర్ మాగంటి సుధాకర్ యాదవ్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోటరామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని మాధవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుధీర్ సేవలు అభినందనీయం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ స్టోర్స్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ యు.సుధీర్‌ను ఆసుపత్రిలోని శుశృత హాలులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, ఫార్మాశిస్టు రాధారాణి, డాక్టర్ మండవ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో ఆవిష్కరణలు సాధ్యం



గుంటూరు రూరల్: నూతన సాంకేతికత ద్వారానే ఆవిష్కరణలు సాధ్యమని వీవీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ దువ్వూరి రాజేష్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో కంప్యూటర్ సైన్స్ మూలాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నాని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి, లక్ష్య సాధన దిశగా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.రాజీవ్‌జట్సన్, డాక్టర్ ఏఎస్ రావు, పి.సుధీర్, సామ్సన్ పాల్గొన్నారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(గుంటూరు వెస్ట్)

9912220356

Office mail : sakshigntadvt@gmail.com

